క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యం : ఎమ్మెల్యే శ్రీగణేశ్



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్



కంటోన్మెంట్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థుల 8 జిల్లాల అండర్–14, అండర్–17 జోనల్ స్థాయి క్రీడా పోటీలు సోమవారం బోయిన్‌పల్లిలోని కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్ ఆవరణలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీగణేశ్, బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌తో కలిసి పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో ఆడిన వారే భవిష్యత్‌లో రాణిస్తారని అన్నారు. బోయినపల్లి రెండోసారి జోనల్ క్రీడలకు అతిథ్యమిస్తున్నదని, అందుకు కృషి చేస్తున్న అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. కంటోన్మెంట్‌లో పలు మైదానాలను అభివృద్ధి చేసి క్రీడలకు అనుగుణంగా తీర్చిదిద్దుతామన్నారు. వికారాబాద్ ,హైదరాబాద్ , రంగారెడ్డి , మేడ్చల్ , సిద్దిపేట , సంగారెడ్డి , కామారెడ్డి , నిజామాబాద్ జిల్లాల నుంచి వచ్చిన 700 మంది క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ ద్వారా ముఖ్య అతిథులకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ , కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌లు విద్యార్థులలతో పాటు కాసేపు వాలీబాల్ ఆడి, వారిలో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి కోటాజీ, కళాశాల ప్రిన్సిపాల్ బానోతు లాలు నాయక్, స్పోర్ట్స్ అధికారిని జ్యోతి, అధికారులు దేవేందర్, రఘుమా రెడ్డి, రెబెక్కా, నీలిమ, వెరోనికా, జ్యోతి, మాధవి, స్థానిక నేతలు ముప్పిడి మధుకర్, బాలరాజ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ డ్రైయిన్ నిర్మాణ పనుల పరిశీలన



టేబుల్ డ్రైయిన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్‌లో రూ. 50 లక్షల వ్యయంతో చేపట్టిన టేబుల్ డ్రైయిన్ నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ సామల హేమ సోమవారం పరిశీలించారు. చిలకలగూడ నుంచి సీతాఫల్‌మండి ఫ్లైఓవర్ వరకు, వారాసిగూడ నుంచి బాపూజీ నగర్ వరకు వాహనదారులు, పాదాచారులు ప్రమాదాలకు గురికాకుండా రోడ్డు, ఫుట్‌పాత్‌ల మధ్య ఖాళీలను మట్టి, కాంక్రీట్‌తో భర్తీ చేస్తారని ఆమె వివరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్మాణపనులు కొనసాగించాలని సూచించారు. అనంతరం సీతాఫల్‌మండి డివిజన్ మహ్మద్‌గూడలో రూ. 15 లక్షల వ్యయంతో మంచినీటి పైప్‌లైన్ ఎత్తుపెంపు నిర్మాణ పనులను పరిశీలించారు. మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌రావు పిలుపు మేరకు నామాలగుండు ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో జమ్మిచెట్టు నాటినట్లు కార్పొరేటర్ హేమ తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్‌ఎస్ నాయకులు గడ్డం అశోక్, సరోజినీ, శ్యామల, రవి, జాకీర్, నూర్, ఆలయ ఛైర్మన్ చందర్ తదితులు పాల్గొన్నారు.

ప్రైవేటు టీచర్లకు కూడా దసరా సెలవులు ఇవ్వాలి



విద్యాశాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సనత్‌నగర్: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల టీచర్లకు సెలవులు అమలుచేయాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ (టీపీటీఎల్‌ఎఫ్) నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు టీపీటీఎల్‌ఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యా శాఖ విద్యా సంస్థలకు దసరా సెలవులు అక్టోబర 2 నుంచి 12వ తేదీ వరకు ప్రకటించిందని, ఆ సెలవులు విద్యార్థులకే కాకుండా టీచర్స్‌కు వర్తిస్తాయని తెలిపారు. అయితే రాష్ట్రంలో ఉన్న కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు కొన్ని విద్యార్థులకు మాత్రమే సెలవులు ఇచ్చి, టీచర్లకు సెలవులు ఇవ్వడం లేదన్నారు. సెలవు రోజుల్లో కూడా ఆ సంస్థలు టీచర్లకు వర్క్‌షాప్‌లు, ఇతర పనులు చెప్పి విద్యా సంస్థలకు రప్పించడం చేస్తున్నారన్నారు. ఇది సరైనది కాదన్నారు. వెంటనే అన్ని ప్రైవేటు పాఠశాలలు తప్పక సెలవులు టీచర్లకు కూడా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలా ఇవ్వని సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సైదులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటా



లబ్ధిదారులకు ఎల్‌ఓసీ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే

చిలకలగూడ: ఎల్లవేళల నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరు అయిన రూ. 2.75 లక్షల విలువైన ఎల్‌ఓసీ పత్రాలను అనారోగ్యానికి గురైన మైలార్‌గడ్డ, దూద్‌బావిలకు చెందిన పెద్దరాజు, కావేరీలకు శస్త్రచికిత్సల నిమిత్తం అందించారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని అన్నారు. సాయినగర్ డబుల్ ఇళ్ల నిర్మాణంపై కలెక్టర్‌కు లేఖ లాలాపేట సాయినగర్‌లో డబుల్ ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే పద్మారావు సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈమేరకు జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు.

కరుడుగట్టిన బైక్ దొంగల అరెస్టు

తొమ్మిది వాహనాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలు, బైక్ దొంగలతో పోలీసులు

సనత్‌నగర్: పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను చాకచాక్యంగా దొంగిలించే కరుడుగట్టిన ఇద్దరు పాత నేరస్తులతో పాటు ఓ బాలుడిని సనత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ వివరాలను వెల్లడించారు. సనత్‌నగర్ ఎస్‌ఆర్‌టీ -268లో నివసించే కొత్తపల్లి రాములు తన ద్విచక్ర వాహనాన్ని ఈ నెల 22న రాత్రి 8 గంటల ప్రాంతంలో తన హోండా యాక్టివా ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్కు చేశాడు. మరుసటి రోజు 23న ఉదయం చూసేసరికి తన వాహనం కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోయేసరికి సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు బైక్‌ను తీసుకెళ్తున్నట్లుగా సీసీ ఫుటేజీలో నిక్షిప్తం కావడాన్ని గమనించారు. ఆ దిశగా దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ఈ నెల 29న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పర్యవేక్షణలో డీఎస్ఐ, సిబ్బంది ఎర్రగడ్డ ప్రధాన రహదారిలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా మూసాపేట నుంచి అమీర్‌పేట వైపు బైక్‌పై వస్తున్న ముగ్గురు వ్యక్తులు అక్కడి పోలీసులను గమనించి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా అనుమానంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో మూసాపేట్ ప్రగతినగర్‌కు చెందిన రామకృష్ణ కుమారుడు మజ్జి శివశంకర్ అలియాస్ శివ అలియాస్ పిల్లి (20), మూసాపేట జనతానగర్‌కు చెందిన బైక్ మెకానిక్ మోతె గోవింద అలియాస్ గోవింద్ (19)లు పాత నేరస్తులుగా తేలింది. జగద్గిరిగుట్ట, గోల్కొండ, కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్లలో శివశంకర్‌పై ఆరు కేసులు, గోవింద్‌పై నాలుగు కేసులు నమోదై ఉన్నాయి. వీరితో పాటు మూసాపేట జనతానగర్‌కు చెందిన బాలుడు (17)ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు నిందితుల నుంచి తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. శివశంకర్, గోవింద్‌లను రిమాండ్‌కు తరలించగా, మైనర్ బాలుడిని జువైనల్ హోంకు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, డీఐ నాగిరెడ్డి, డీఎస్ఐ అరుణ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు శేఖర్, నాగాజు, గౌతమి, మహ్మద్ ఇబ్రహీంలను డీసీపీ అభినందించారు. ఈ సమావేశంలో బాలానగర్ ఏసీపీ హనుమంతరావు కూడా పాల్గొన్నారు.

అక్కాతమ్ముళ్ల చోర కళ

బస్సులు, బస్‌స్టాపుల్లో చోరీలు

10 పోలీస్ స్టేషన్ల పరిధిలో సెల్‌ఫోన్ దొంగతనాలు



నిందితులను చూపిస్తున్న పోలీసులు

రాంగోపాల్‌పేట్: ఇద్దరూ అక్కా, తమ్ముడు...వారి చేయిపడిందంటే జేబులు గుల్ల కావాల్సిందే. రద్దీగా ఉండే బస్టాపులు, బస్సులే వారి చోరీలకు అడ్డా. ఇలా ఒకటా రెండా తొమ్మిది పోలీస్ స్టేషన్ల పరిధిలో మొబైల్ ఫోన్లను చోరీ చేసి తప్పించుకుని తిరుగుతుండగా ఉత్తర మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. దొంగిలించిన ఫోన్లను కొన్న మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుదీంద్ర తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్‌కు చెందిన సిరిగిరి కవిత (37), మేడ్చల్‌కు చెందిన వీ ప్రసాద్ (28)లు అక్కా తమ్ముళ్లు. ఇద్దరు కలిసి గత కొద్ది నెలల నుంచి సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇద్దరూ కలిసి రద్దీగా ఉండే బస్టాపులు, బస్సుల్లోని ప్రయాణికులను టార్గెట్ చేసికుంటారు. వారి జేబులు, పర్సుల్లో ఉండే మొబైల్ ఫోన్లను తమ చేతి వాటంతో కాజేసీ వెంటనే బస్సు దిగి వెళ్లిపోతారు. కొట్టేసిన మొబై ఫోన్లను కాచిగూడకు చెందిన రఫీయుదీన్ (30), మేడ్చల్‌కు చెందిన మహ్మద్ మొయిన్ (26)లకు విక్రయించి సొమ్ము చేసికుంటున్నారు. సోమవారం ఇద్దరు నిందితులతో పాటు మరో దొంగిలించిన సెల్‌ఫోన్లు కొనుగోలు చేసిన మరో ఇద్దరిని అరెస్టు చేసి గోపాలపురం పోలీసులకు అప్పగించారు. నిందితుల నుంచి 19 మొబైల్ ఫోన్లు, ఒక యాక్టివా వాహనం స్వాధీనం చేసికున్నారు. ఇద్దరు నిందితులు గతంలో పాత నేరస్తులు వీరిపై గోపాలపురం, ఉప్పల్, కామారెడ్డి, రామాయంపేట్, మేడ్చల్, ఓయూ, సిద్దిపేట్ తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇలాగే కేసులు నమోదై ఉన్నాయి.

నవరాత్రి ఉత్సవాలకు కోట నీలిమకు ఆహ్వానం



సనత్‌నగర్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో జరిగే దేవీ నవరాత్రి మహోత్సవాలకు హాజరుకావాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమకు ఆలయ అధికారులు ఆహ్వానం పలికారు. ఈఓ మనోహర్‌రెడ్డి, ఆలయ పూజారులు సోమవారం ఆమె కార్యాలయంలో కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు.

దేవీ నవరాత్రోత్సవాలకు ఏర్పాట్లు చేయండి



జోనల్ కమీషనర్‌కు వినతి పత్రం సమర్పించిన బీఆర్‌ఎస్ నాయకులు

బన్సీలాల్‌పేట్: దేవీ నవరాత్రోత్సవాలకు ఆయా దేవాలయాల వద్ద ఏర్పాట్లు చేయాలని కోరుతూ పలువురు నాయకులు జీహెచ్‌ఎంసీ జోనల్ కమీషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు రాజు, గజ్జెల శ్రీనివాస్, వెంకటేష్ ముదిరాజ్ తదితరులు కలిసి జోనల్ కమీషనర్‌కు వినతి పత్రం సమర్పించారు.

పేదలను బాధ పెట్టడమేనా ప్రజా పాలన

బౌద్ధనగర్: మూసీ పేదల తరలింపుపై తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్‌గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజా పాలన చేస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం దీనికి పూర్తి విరుద్ధంగా పయనిస్తుందన్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో పేదల తరలింపుపై ఏకపక్షంగా వ్యవహరించడమే దీనికి నిదర్శనమన్నారు. మూసీ పరివాహక ప్రాంతాల పేదలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని, పేదలు నివసించే ప్రాంతాలు ఉద్రిక్తంగా మారుతున్నాయన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

బంజారాహిల్స్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని జూబ్లీహిల్స్ ఏసీపీ గిరి అన్నారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–10లోని వెంకటగిరి సమీపంలోని ఐలం కాలనీలో కాలనీ అసోసియేషన్ ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాల వ్యవస్థకు సోమవారం జూబ్లీహిల్స్ ఏసీపీ గిరి, ఇన్‌స్పెక్టర్ కె. వెంకటేశ్వరరెడ్డి, డీఐ మధుసూదన్, సెక్టార్ ఎస్ఐ సోమశేఖర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీవాసులను బాధ్యతగా కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వచ్చినందుకు సన్మానించారు. త్వరలోనే కాలనీ మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని సాహెర్ సౌండ్ యజమాని లాయక్ అలీ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్‌యాదవ్, ఉపాధ్యక్షుడు విలాస్, ట్రెజరర్ సంతోష్, పవన్‌యాదవ్, దీపక్, గోవింద్, సుబ్బారావు, ముఖేష్, జియాద్దీన్ తదితరులు పాల్గొన్నారు. నేరాల నియంత్రణ, నేరస్తులను గుర్తించడానికి కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తాము కోరగానే స్పందించిన కాలనీ అసోసియేషన్‌ను పోలీసులు అభినందించారు.



సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో జూబ్లీహిల్స్ పోలీసులు

ఓజోన్ పొరను రక్షించుకుందాం



అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవంలో మాట్లాడుతున్న వక్తలు

సనత్‌నగర్: అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సనత్‌నగర్‌లోని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో విద్యార్థులకు 'ఓజోన్ పొర రక్షణ–దాని ప్రాముఖ్యత'పై సోమవారం వక్తృత్వ పోటీలను నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి 100 మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరై తమ సత్తా చాటారు. మానవ ఆరోగ్యం, పర్యావరణాన్ని రక్షించడంలో ఓజోన్ పొర పోషిస్తున్న కీలక పాత్రను విద్యార్థులు నొక్కి చెప్పారు. ఓజోన్ దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది థీమ్ అయిన 'మాంటెరియల్ ప్రోటోకాల్ అడ్వాన్సింగ్ క్లైమేట్ యాక్షన్' అంశంపై సైతం విద్యార్థులు అనర్గళంగా మాట్లాడారు. ఓజోన్ క్షీణతపై విద్యార్థులు తమ ఆలోచనలను పంచుకున్నారు. బోర్డు సభ్యుడు, తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు జయదేవ్ మాట్లాడారు.

అందరికీ నాణ్యమైన విద్య అందించాలి

అడ్డగుట్ట: మారేడుపల్లి మండల కేంద్రంలోని బీజేఆర్ కమ్యూనిటీహాలులో సోమవారం బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తెలంగాణ తల్లుల సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వాలు విఫలమౌతున్నాయన్నారు. ఇప్పటికీ ఉచిత నిర్బంధ విద్య హక్కుచట్టం వచ్చి 15 సంవత్సరాలు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రం విద్యలో 35వ స్థానంలో ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. సీఆర్‌పీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, రమాదేవి, ప్రవీణ్, తల్లుల సంఘం ప్రతినిధులు జమున, పుష్ప, కాంపల్లి శ్రీను, శోభ, శాంత, వీరయ్య, స్వరూప, ఎంవీ ఫౌండేషన్ ఆర్గనైజర్లు సువర్ణ, భాగ్య, సుమలత తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలపై ఉక్కుపాదం మోపాలి



ప్రజావాణిలో జెడ్‌సీకి వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాస్

చిలకలగూడ: జీహెచ్‌ఎంసీ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, కబ్జాలపై ఉక్కుపాదం మోపాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ కోరారు. ఈమేరకు జోనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జెడ్‌సీ రవికిరణ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. నిబంధనలు అతిక్రమించి అక్రమ నిర్మాణాలు, కబ్జాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే మార్గాన్ని మూసివేసి, అడ్డంగా నిర్మించిన ప్రహరీ, షెడ్‌లను తక్షణమే తొలగించి, విద్యార్థులు చదువుకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని కోరగా, జెడ్‌సీ రవికిరణ్ సానుకూలంగా స్పందించారని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ తెలిపారు.

తల్లి, ఇద్దరు కొడుకుల అదృశ్యం



కృపా పమ్మి

అడ్డగుట్ట: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన తల్లీకొడుకులు అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన మేరకు.. లండన్‌కు చెందిన కృపా పమ్మి(35) అక్కడే యాపిల్ కంపెనీలో పని చేస్తున్నారు. కొన్నేళ్ల క్రితం వరుణ్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి జార్డన్(12), జేడన్(8) ఇద్దరు కుమారులు. కొంత కాలంగా కృపతో ఆమె భర్త గొడవ పడడం, వేధింపులకు గురి చేస్తుండడంతో సెప్టెంబర్ 19న తన ఇద్దరు కుమారులు జార్డన్, జేడన్‌లను తీసుకొని ఇండియాకు వచ్చింది. కవాడిగూడలోని తన తల్లి లిల్లీ ఇంటికి వెళ్లింది. 22వ తేదీన మహేంద్రాహిల్స్‌లో నివాసముంటున్న ఆమె సోదరి మేరీ దీపాలి ఇంటికి వచ్చింది. కాగా, తన భర్త వరుణ్ యూ.కే నుంచి ఇక్కడికి వస్తున్నాడని తెలుసుకున్న కృప ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఇద్దరు కుమారులను తీసుకొని వెళ్లిపోయింది. తమ గురించి గాలించవద్దని తాము సేఫ్‌గా ఉన్నామంటూ సోదరి మేరీ దీపాలి సెల్‌ఫోన్‌కు మెసేజ్ పెట్టింది. దీంతో వారు వెంటనే స్థానిక తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం



పదవీ విరమణ చేసిన వారిని సత్కరిస్తున్న నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తదితరులు

లక్డీకాపూల్: రిటైర్మెంట్ అనేది వ్యక్తి జీవితంలో ఒక ప్రధాన అంశమని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. ముఖ్యంగా ఉద్యోగి పదవీ విరమణ చెందడమంటే వర్కింగ్ ప్రొఫెషనల్ జీవితం నుంచి వైదొలగడమన్నారు. సోమవారం నిమ్స్ డేటా బేస్ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ ఫణి కుమార్, టెక్నికల్ ఆఫీసర్ రేష్మ శెట్టి, సీనియర్ సెక్రెటేరియల్ అసిస్టెంట్ యాదయ్య, అసిస్టెంట్ సెక్యూరిటీ అధికారి తిరుపతి రెడ్డి, థెటర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రావులు పదవీ విరమణ చెందారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వీరిని ఘనంగా సన్మానించి గౌరవంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్స్‌లో సుదీర్ఘకాలం పాటు విధుల్లో నిబద్ధతతో సేవలందించిన వీరంతా తమ శేష జీవితం ప్రశాంతంగా సాగిపోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. లక్ష్మి భాస్కర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్. శాంతివీర్, పారా మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ మాజీ అధ్యక్షులు గిరిజా మనోహర్, శ్రీనివాసులు, తెలంగాణ ఉద్యోగుల సంఘం నగర అధ్యక్షుడు రాజ్ కుమార్, నిమ్స్ లైజనింగ్ ఆఫీసర్ మార్త రమేష్, మీడియా ఇన్‌చార్జి సత్యాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా వివిధ ఉద్యోగుల సంఘ నాయకులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.

మోండా మార్కెట్ ఓల్డ్ జైలు బాధితులను ఆదుకోవాలి

బన్సీలాల్‌పేట్: మోండా మార్కెట్ డివిజన్ ఓల్డ్‌జైలు ప్రహారీగోడ బాధితులకు ప్రభుత్వం బాసటగా నిలిచి ఆదుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం ఓల్డ్‌జైలు ప్రాంతంలో మేరు సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 70 సంవత్సరాల నుంచి టైలరింగ్ వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న పేదలను దురదృష్టకరమైన సంఘటన వారి జీవితాలను చిన్నాభిన్నం చేసిందన్నారు. ప్రభుత్వం తరఫున బాధితులను ఆదుకోవాలని కోరారు.

డీజేలకు అనుమతి లేదు



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ మొగులయ్య

బన్సీలాల్‌పేట్: బహిరంగ ప్రదేశాల్లో ఉత్సవాలు, శుభకార్యాల్లో డీజే సౌండ్ సిస్టమ్, ప్యాడ్ బ్యాండ్‌లను అనుమతి లేకుండా ఏర్పాటు చేయరాదని గాంధీనగర్ ఏసీపీ మొగులయ్య సూచించారు. గాంధీనగర్ పోలీసు స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ.. నగరంలో శబ్దకాలుష్యం పెరిగిపోయిందని, డీజే సౌండ్ వల్ల ఎంతో మంది యువత ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. రానున్న దేవీ నవరాత్రోత్సవాల్లో డీజేలను అనుమతి లేదన్నారు.ఇన్‌స్పెక్టర్ రాజు, ఎస్ఐలు నాగరాజు రెడ్డి, నయీమ్ పాల్గొన్నారు.

మోడల్‌కాలనీలో మొక్కలు నాటిన నాయకులు



సనత్‌నగర్: పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఉద్యానవనంలో సోమవారం అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జీఎస్‌టీ శాయి, ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు తదితరులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. వాతావరణ మార్పుల దృష్ట్యా పచ్చదనాన్ని మరింతగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

పరిశోధనకు రూ.50 లక్షల ప్రభుత్వ గ్రాంట్స్



ప్రభాకర్, నరేంద్ర కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పూర్వవిద్యార్థులు డా.గాజుల ప్రభాకర్, డా.పాపతోటి నరేంద్ర కుమార్ పరిశోధనకు తెలంగాణ ప్రభుత్వం రూ.50 లక్షల గ్రాంట్స్ లభించింది. మిర్చి, మామిడి, పంటలకు తీవ్ర సమస్యగా మారి పంటను నాశనం చేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న నల్ల తామర పురుగు తెగులు నివారణకు కనిపెట్టిన ఆర్గానిక్ బయోపెస్టిసైడ్ త్రిప్స్ క్లియర్‌ను రైతులకు తక్కువ ధరకు అందుబాటులో తీసుకొచ్చేందుకు గ్రాంట్స్ అందచేసినట్లు తెలిపారు.

'వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు



జేపీసీకి వినతి పత్రం అందజేసిన బీజేపీ నేత మల్క కొమురయ్య

కంటోన్మెంట్: వక్ఫ్ సవరణ బిల్లు –2024కు మద్దతుగా పెద్ద ఎత్తున పిటిషన్‌లు అందజేయాలని బీజేపీ సీనియర్ నేత, ప్రముఖ విద్యావేత్త మల్కా కొమురయ్య అన్నారు. సోమవారం మహేంద్రాహిల్స్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లుగా పలు సాహసోపేత నిర్ణయాలు తీసుకుందన్నారు. అందులో వక్ఫ్ సవరణ బిల్లు –2024 కూడా ఒకటన్నారు. ఈ బిల్లుకు అనుగుణంగా ప్రజలు తమ వైఖరిని వెల్లడిస్తే, త్వరలోనే నూతన చట్టం అమల్లోకి వస్తుందన్నారు. తద్వారా వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో కొత్త విధానం అమలవుతుందన్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



స్వరూపరాణిని సన్మానిస్తున్న దృశ్యం

గాంధీఆస్పత్రి: క్రమశిక్షణ, చిత్తశుద్ధితో అందించిన సేవలే ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపు ఇస్తాయని గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి అన్నారు. గాంధీ ఆసుపత్రి ఫార్మసి సూపర్‌వైజర్ స్వరూపారాణి పదవీ విరమణ కార్యక్రమం గాంధీ అలుమ్ని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించారు. వృత్తి నిబద్ధత చూపించే ఉద్యోగులు మిగిలినవారికి ఆదర్శంగా నిలుస్తారని, స్వరూపరాణి అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఆర్ఎంఓ–1 శేషాద్రి, ఏడీ ఫ్లోరెన్స్‌మర్లిన్, మెడికల్ ఆఫీసర్ శాంతరాణి, ఫార్మసీ ఇంఛార్జీ సుధాకర్‌రెడ్డి, ఆర్ఎంఓ యోగేందర్, టీఎన్‌జీవో ప్రెసిడెంట్ ప్రభాకర్, భావన, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మి సువర్చలకు బెస్ట్ టీచర్ అవార్డు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ (విద్యాశ్రమం) సీనియర్ ఇంగ్లిష్ టీచర్ కె.లక్ష్మి సువర్చలకు జాతీయ స్థాయిలో బెస్ట్ టీచర్ అవార్డు లభించింది. భవన్స్ జిందాల్ అవార్డు 2023 నేషనల్ లెవల్ సీనియర్ కేటగిరిలో ఈ అవార్డు ఆమెను వరించింది. పాఠశాలలో విద్యార్థుల ఉన్నతికి ఆమె చేస్తున్న కృషికి గుర్తింపునకు గాను ఈ అవార్డు లభించగా స్కూల్ ఛైర్మన్ ఎస్.గోపాలకృష్ణన్, డైరెక్టర్ సి.రమాదేవి, ప్రిన్సిపాల్ జి.అరుణశ్రీలతో పాటు ఉపాధ్యాయులు ఆత్మీయ సత్కారం చేశారు. ఆమె ఈ అవార్డుకుగాను బంగారు పతకం, ప్రశంసా పత్రం, రూ.20 వేల నగదును కూడా అందుకున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379